శాశ్వత పరిష్కారంపై శీతకన్నేలా?

- తరచూ దెబ్బతింటున్న శ్రీరామ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్
- ప్రతిసారి మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు
- సమస్య పరిష్కారానికి రూ.10.5 కోట్లతో డీపీఆర్
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు



కోటపాడులోని శ్రీరామ ఎత్తిపోతల పంప్ హౌస్



సమస్యకు గురైన పైప్‌లైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఒంటిమిట్ట : రెండవ అయోధ్య ఒంటిమిట్టను కరువు రక్కసి పీడించకూడదు అనే ఉద్దేశంతో ఒంటిమిట్ట చారిత్రక తటాకానికి(చెరువు) సోమశిల వెనుక జలాలను తెప్పించేందుకు 2015వ సంవత్సరం ఏప్రిల్ 20న మండల పరిధిలోని కోటపాడులో శ్రీరామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ని రూ. 30 కోట్ల పైచిలుకుతో నిర్మించారు. దీంతో సర్వే నెంబర్ 1531/2లో 194.81 ఎకరాల్లో ఉన్న ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలు వచ్చేలా చేశారు. ఈ చెరువు ఆయకట్టు కింద ఉన్న 1,014.28 ఎకరాలకు ప్రత్యక్షంగా చెరువు కాలువల ద్వార, పరోక్షంగా నీటి బోర్ల ద్వారా మరిన్ని ఎకరాలకు సాగు నీరు అందించారు. కానీ అప్పటి నుంచి ఈ ఎత్తిపోతల పథకానికి సాంకేతిక సమస్యలు, పైప్‌లైన్ సమస్యలు తలెత్తుతున్నాయి. అది టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడైనా ఇవే సమస్యలు పునరావృత్తం అవుతున్నాయి. ఈ పథకం ప్రారంభంలో ఏపీఐడీసీ వారి ఆధీనంలో నడుస్తూ ఉండేది, కానీ తరచూ ఎత్తిపోతల పథకానికి సమస్యలు వస్తుండటంతో ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం నిర్వహణ భారంగా మారి రాష్ట్ర నీటిపారుదల శాఖకు అప్పగించారు. ఏపీఐడీసీ నుంచి నీటిపారుదల శాఖకు మారినా సమస్యలు మాత్రం పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. ఇప్పటికీ అవే సమస్యలు పునరావృతం అవుతున్నాయి. కోటపాడు పంప్ హౌస్ నుంచి కనుమ వరకు 900 మి.మి. వ్యాసం ఉన్న పీఎస్‌సీ రకం పైపులను 3.025 కి.మీ మేర వేశారు. ఈ పీఎస్‌సీ రకం పైపులు కావడంతో మోటార్లు ఆడుతున్న సమయంలో అనుకోకుండా కరెంట్ పోయినపుడు పైపులలో సరఫరా అవుతున్న నీరు వెనక్కి ఉన్నఫలంగా పైతట్టు ప్రాంతం నుంచి లోతట్టు ప్రాంతానికి వచ్చే క్రమంలో నీటి ఒత్తిడిని తట్టుకోలేక పైపులు పగిలిపోతున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలను అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు పంపింగ్ చేసేందుకు యత్నించగా, ప్రతిసారి పైప్‌లైన్‌లు దెబ్బతినింది. శాశ్వత పరిష్కారం చూపి ఆంధ్ర భద్రాద్రికి నీటిని చేర్చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. పైప్‌లైన్ పగిలిన ప్రతి సారి లక్షలు వెచ్చించే బదులు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత నీటి పారుదల శాఖ అధికారులకు లేదా అంటూ మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. శ్రీ రామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లో ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలను అందించేందుకు మూడు 465 హెచ్‌పీ మోటర్లను అమర్చారు. ఒక్కొక్క మోటర్ 10.18 కూసెక్కుల నీరు తరలించవచ్చు. అంత సామర్థ్యం కలిగిన మోటార్ల తాకిడిని పీఎస్‌సీ రకం పైపులు తట్టుకోలేక పోవడంతోనే ఈ సమస్యలు ఎదురు అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పైప్ లైన్ శాశ్వత పరిష్కారం కోసం స్టీల్ పైప్ లైన్ వేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు సుమారు రూ.10.5 కోట్లకు అంచనా వేసి ప్రభుత్వానికి పంపారు. ఇంత వరకు అనుమతులు రాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలు అందించడంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మండల ప్రజలు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేసైన చెరువును నింపుతాం

పైప్ లైన్ సమస్యలు తలెత్తిన ప్రతి చోట మరమ్మతులు చేసైనా ఒంటిమిట్ట చెరువును సోమశిల వెనుక జలాలతో నింపుతాం. ఆయకట్టు రైతుల సమస్యను తీరుస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. శాశ్వత పరిష్కారానికి అంచనా వేసి ప్రభుత్వానికి పంపించాం. తిరిగి రిమార్క్స్ చూసి, మరలా పంపించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

– వెంకటరామయ్య, ఈఈ, నీటిపారుదల శాఖ, కడప

శాశ్వత పరిష్కారం చూపాలి



ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లో మోటార్లు ప్రారంభించనప్పుడల్లా పైపు లైన్‌లు పగిలిపోకుండా ఉండాలంటే స్టీల్ పైపులు వేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. దీని కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారుల సహాయంతో సుమారు రూ. 10.5 కోట్లకు అంచనా వేయించాం. కూటమి ప్రభుత్వం, అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలి.

– ఆకేపాటి శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, ఒంటిమిట్ట

క్లుప్తంగా

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు : ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. గురువారం పెనగలూరులో సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు సౌందర్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే శాఖల వారీగా అధికారులతో ఆయన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. పెనగలూరు-1 ఎంపీటీసీ శ్రీదేవి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామానికి చెయ్యేరు నీరు రావడం లేదని సభ దృష్టికి తీసుకురాగా వెంటనే వారు స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి సునీతను ఆదేశిస్తూ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఒక్కొక్క శాఖ అధికారి ఆశాఖ చేపట్టిన పనులపై సభలో వివరించారు. సమావేశంలో విద్యుత్ సమస్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఓబులవారిపల్లె : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొంది సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్య అధికారి గురు మహేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులోకి న్యాయ సేవలు తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు న్యాయం కోసం ఇబ్బందులు పడకుండా ఇటువంటి న్యాయ సలహాలకు 15100 నెంబర్‌రు ఫోన్ చేసి ఉచిత న్యాయ సలహాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దీప, సీహెచ్‌ఓ నగేష్ పాల్గొన్నారు.

ఆలయానికి శఠగోపం వితరణ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళ దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రూ. 50 వేలు విలువ గల వెండి శఠగోపంను గొర్ల రఘునాథరెడ్డి, సౌభాగ్యమ్మ దంపతులు గురువారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి స్వామి, ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్ రెడ్డి ఆలయ ధర్మకర్తలు గొర్ల మోహన్ రెడ్డి, భూదేవమ్మలకు అందజేశారు.

బాల్య వివాహాలు అరికడదాం

చిట్వేలి : బాల్య వివాహాలను అరికడదామని డీసీపీఓ రామలక్ష్మీ పిలుపునిచ్చారు. జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు గురువారం చిట్వేలి గ్రామ పంచాయతీ స్థాయిలో కమిటీ సమావేశం జరిగింది. ఇందులో బాల్య వివాహలను ఎలా నిషేధించాలి, కమిటీలోని సభ్యుల బాధ్యతలు ఏంటి అనే అంశాలను వివరించారు. గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ చైర్‌పర్సన్ గాను, మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్ గాను వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఉమామహేశ్వర్ రెడ్డి, కన్వీనర్ గాలి అమరావతి, సీడీపీఓ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, గాడి ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ శ్రీనివాసుని పరిణయం



కల్యాణ క్రతువును జరిపించిన వేదపండితులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని దేవస్థానంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య గురువారం లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణం కమణీయంగా.. కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వాములవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయించి ప్రత్యేక అలంకరణ జరిపి మండపానికి తీసుకువచ్చారు. అనంతరం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ కల్యాణాన్ని వేదపండితులు వేడుకగా నిర్వహించారు.

గ్రామ దర్శినిలో అధికారులు

సిద్దవటం : జంగాపల్లె గ్రామంలో గురువారం గ్రామ దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించామని మండల ప్రత్యేకాధికారి జయసింహ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి జయసింహ మాట్లాడుతూ చెత్త సంపద సృష్టి కేంద్రం వద్ద చెత్తాచెదారాలను తొలగించి హరిత రాయబారులతో కలిసి పచ్చదనాన్నిపెంచే విధంగా మొక్కలు నాటాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ దీపాలు, రహదారి, ఎస్సీ, ఎస్టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఈఓపీఆర్‌డీ మెహతాజ్ యాస్మిన్, పంచాయతీ ఏఈ నాగరాజు, సర్పంచ్ వెంకటమ్మ పాల్గొన్నారు.

సమాచార చట్టాన్ని వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మండలంలోని రైతుసేవా కేంద్రం సహాయకులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో గురువారం సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమన్ని నిర్వహించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. వివిధ సెక్షన్‌లను వివరించామన్నారు. సెక్షన్ 6,7 (1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వని సందర్భాల్లో సమాచార అధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. సమాచారం తెలుసుకోవడం ప్రజల హక్కు. సమాచార హక్కు చట్ట ప్రకారం కోరిన సమచారం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖ అధికారులకు సదరు దరఖాస్తును బదలాయించ వచ్చునన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జయసింహ, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలి నరసయ్య సేవలు మరువలేనివి

రాజంపేట రూరల్ : మండల అభివృద్ధికి పోలి నరసయ్య చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని అప్పారాజుపేట గ్రామంలో వయోభారంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోలి నరసయ్య భౌతికకాయానికి గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా బైపాస్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త షాహిద్ నూతనంగా ఏర్పాటు చేసిన సోనెక్స్ కార్ డెకార్స్‌ను ఆకేపాటి ప్రారంభించారు. మన్నూరులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇడమడకల లక్ష్మీనారాయణ దశదిన కర్మలలో పాల్గొని నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆకేపాటి వెంట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, దండు గోపీ, డీలర్ సుబ్బరామిరెడ్డి, దాసరి పెంచలయ్య, జీవీ కృష్ణారావు, పోలీ వేణుగోపాల్‌రెడ్డి, జీవీ సుబ్బరాజు, ఎం.శ్రీనివాసులగౌడ్, సి.మనోహరరెడ్డి, ఆర్.గురుమూర్తి, ఆర్.కమాలకర్‌రావు, ఎం.శ్రీనివాసులు, కె.రెడ్డెయ్య, ఎ.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామం, రెడ్డివారివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాడి సుబ్బారెడ్డి తండ్రి గాడి జయరాంరెడ్డి దశదిన కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి పాల్గొని మృతుడు జయరాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

జూదరులు అరెస్టు

వీరబల్లి : సంఘంవాళ్లపల్లి సమీపంలోని కంపచెట్ల పొదల్లో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడి వెళ్లి ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. అలానే వారి వద్ద నుంచి రూ.4200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానవత్వం మూర్తిభవించిన మహోన్నత వ్యక్తి రతన్‌టాటా

రాజంపేట టౌన్ : రతన్ టాటా మానవత్వం మూర్తిభవించిన మహోన్నత వ్యక్తి అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం రతన్‌టాట చిత్రపటానికి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రతన్ టాటా తన సంపాదనలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టడమే కాక, పేదలకు ఇతోదికంగా సహాయం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి. ఆదినారాయణ, వీవీ రమణ, పాపయ్య, తోట నగేష్, పెనుగొండ రమణ, పత్తిపాటి నవీన్‌కుమార్, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

దేశం మానవతా మూర్తిని కోల్పోయింది

రామాపురం : ఓ మానవతా మూర్తిని, దేశ ముద్దు బిడ్డని భారతమాత కోల్పోయిందని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని గౌతమ్ పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ రతన్‌టాటా దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ రవికుమార్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శశి, ఉపాధ్యాయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ఉచిత కంటి పరీక్షలు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ, రాజంపేటలో ఎన్ఎస్ఎస్ విభాగం, అగర్వాల్ ఐ క్లినిక్ సంయుక్తంగా గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని నేత్రాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా వారు కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ సంతోష్ అగర్వాల్ ఐ క్లినిక్ వారు మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగు సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. మల్లికార్జున రావు, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుష్ట సంహారిణి.. శిష్ట రక్షణి

ఆదిశక్తి, పరాశక్తి.. కాపాడమ్మా అంటూ మహిషాసుర మర్దిని అలంకారంలో కొలువైన అమ్మవార్లను భక్తులు వేడుకున్నారు. రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు పరిధిలోని వివిధ మండలాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు శక్తి స్వరూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారిని దర్శించి పూజలు చేయించారు. – సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: మహాగౌరి అలంకారంలో మారెమ్మ



నందలూరు: మహిషాసుర మర్దినిగా వాసవీమాత



సుండుపల్లె: దుర్గాదేవిగా అమ్మవారు



రాజంపేట రూరల్: మహిషాసుర మర్దినిగా కనకదుర్గమ్మ



చిన్నమండెం: శ్రీ మహిషాసుర మర్దినిగా వాసవీమాత



గాలివీడు: అమ్మవారికి హారతి ఇస్తున్న వేద పండితులు



సంబేపల్లె: శ్రీ దుర్గాదేవిగా నల్లగంగమ్మ



రాయచోటి టౌన్: దుర్గాదేవి దేవిగా చౌడేశ్వరీ దేవి



రైల్వేకోడూరు అర్బన్: మహిషాసురమర్దినిగా కన్యకాంబ



చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో శ్యామలాంబ దేవి



పుల్లంపేట: భక్తులకు దర్శనమిస్తున్న మారెమ్మ



పెనగలూరు: దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

నేడు గుండప్రవేశం

రాజంపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిశాల ముఖద్వారం వద్ద గుండప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంథే సత్యనారాయణగుప్తా తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో కుంకుమార్చన

శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మన్నూరులోని ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ధర్మచార్యులు గంగనపల్లె వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

దసరా ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలి



వీరచౌడేశ్వరీదేవిని దర్శించుకుంటున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : దసరా పండుగ ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీరచౌడేశ్వరీదేవికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది ప్రజలు, రైతులు తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు పడకుండా సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చొప్పా ఎల్లారెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, కలికిరి కృష్ణయ్య, జీవీ. సుబ్బరాజు, దండు గోపి పాల్గొన్నారు.